సాక్షి సంగారెడ్డి

బుధవారం । 21 । జూన్ । 2023



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

శారీరక, మానసిక ఆందోళనలను తగ్గిస్తూ, సంపూర్ణ ఆరోగ్యం, నిత్య నూతనోత్సవాన్ని అందించేది యోగా. యోగా, ధ్యానం చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పెద్దలు చెబుతారు. 8లో



సకాలంలో స్పందించాలి

రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు త్వరగా స్పందిస్తే సాటి మనిషి ప్రాణాలు దక్కుతాయని డీఎస్పీ రఘు అన్నారు. జాతీయ రహదారి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. 9లో

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం పది మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు పది మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

కలసికట్టుగా బీజేపీని బలోపేతం చేయాలి



టిఫిన్ పే చర్చలో జాతీయ ప్రధాన కార్యదర్శి అరవింద్, నాయకులు

పటాన్‌చెరు టౌన్: కలసికట్టుగా బీజేపీని బలోపేతం చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర సహ ఇన్‌చార్జి అరవింద్ మీనన్ అన్నారు. మంగళవారం బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో పూజలు చేసిన అనంతరం మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 'టిఫిన్ పే' చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ప్రధాన కార్యదర్శి అరవింద్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్, నాయకులతో కలిసి పార్టీ బలోపేతంపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, అమీన్‌పూర్ కౌన్సిలర్ ఎడ్ల రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ అధ్యక్షుడు ఆగారెడ్డి, జిన్నారం మండల అధ్యక్షుడు బండి శ్రీకాంత్, బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

సంగారెడ్డిటౌన్: కళాశాలల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని తార ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేటలోని కళాశాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలోని మూత్రశాలలు, ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని, వారికి తగిన సదుపాయాలను కల్పించాలని హెచ్చరించారు. ఆయన వెంట న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కేతకిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయం

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయంలో బుధవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శశిధర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా పార్వతీపరమేశ్వరులకు అర్చన, అభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం, భస్మహారతి, చండీ, రుద్ర హోమం, వేదపారాయణం, సహస్రనామ పారాయణంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం నక్షత్ర హారతి ఉంటుందని తెలిపారు.

పాఠ్యపుస్తకాలు త్వరగా అందజేయాలి

సంగారెడ్డి టౌన్: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందజేయాలని తపస్ రాష్ట్ర సహాయ కోశాధికారి భాస్కర్ అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) సంగారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. విద్యార్థులకు నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలను ప్రారంభంలోనే పంపిణీ చేస్తామన్న ప్రభుత్వం ఇంతవరకు పంపిణీ చేయలేదన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. విద్యావలంటీర్ లను నియమించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి, ప్రధాన కార్యదర్శి అడివప్ప, రాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర సహాయ కోశాధికారి భాస్కర్

కేసీఆర్‌నగర్.. సూపర్!

- దేశంలోనే అతిపెద్ద డిగ్నిటీ హౌసింగ్ కాలనీగా కొల్లూరు
- టౌన్‌షిప్‌ను తలపించేలా 15,660 ఇళ్లు
- 145 ఎకరాల్లో 117 బ్లాకులుగా నిర్మాణం
- పార్కులు, ఆటస్థలాలు, స్కూల్స్, బస్తీ దవాఖానాలకు స్థలాల కేటాయింపు

సాక్షి, సిటీబ్యూరో, రామచంద్రాపురం: గతంలో పేదల కోసం నిర్మించే ఇళ్లంటే ఇరుకు ఇరుకుగా అగ్గిపెట్టెల్లా ఉండేవి. బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లతో వాటి పరిస్థితి మారింది. కొల్లూరులోని భారీ డబుల్ బెడ్రూం హౌసింగ్ కాలనీ 'కేసీఆర్ నగర్'ను సకల సదుపాయాలతో నిర్మించారు. ఇళ్లతోపాటే కనీస మౌలిక వసతులైన తాగునీరు, డ్రైనేజీతో పాటు భవిష్యత్ అవసరాలకనుగుణంగా తగిన స్థలాలు కేటాయించారు. కొల్లూరు-2 ప్రాజెక్టు కింద నిర్మించిన ఈ డిగ్నిటీ హౌసింగ్ కాలనీలో ఇళ్లు, సదుపాయాలు ఇలా ఉన్నాయి.



భవన సముదాయ ప్రాంగణం



రాకపోకలకు ఏర్పాటు చేసిన లిఫ్ట్

కాలనీ విస్తీర్ణం: 145.50 ఎకరాలు
ప్రాజెక్టు వ్యయం: రూ.1489.29 కోట్లు
ఒక్కో ఇంటి వ్యయం మౌలిక సదుపాయాలతో: రూ.8.65 లక్షలు (ఇంటికి రూ.7.90 లక్షలు, మౌలిక సదుపాయాలకు రూ.0.75 లక్షలు)
కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షలు
ఇప్పటి వరకు చేసిన ఖర్చు: రూ. 1474.75 కోట్లు

నిర్మాణం: స్టిల్ట్+ 9, 10, 11 అంతస్తులుగా.
భూ వినియోగం: నిర్మాణ స్థలం 37 శాతం, పచ్చదనం, పార్కులు, ప్లేగ్రౌండ్లు, ఓపెన్ స్పేసెస్‌కు 25 శాతం, భవిష్యత్‌లో అవసరాల కోసం 38 శాతం
నిర్మాణాలు ప్రారంభం: 2018 ఫిబ్రవరి 22
నిర్మాణాలు పూర్తి: 2021 జనవరి 26

బ్లాకులు ఇలా..
- ప్రతీ బ్లాకులో 2 లిఫ్టులు, ఒకేసారి 8 మంది వెళ్లొచ్చు
- 2 లేదా 3 మెట్ల మార్గాలు
- స్టిల్ట్‌లో పార్కింగ్ సదుపాయం, వాచ్‌మెన్ క్వార్టర్
- అగ్నినిరోధకవ్యవస్థ ఏర్పాట్లు
- కారిడార్లలో లైటింగ్ ఏర్పాట్లు



మౌలిక సదుపాయాలు.. ప్రత్యేక ఫీచర్లు
- 13.50 కి.మీల వీడీసీసీ రోడ్లు, రోడ్ల వెడల్పు 6–36 మీటర్లు
- భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ 10.60 కి.మీలు
- 9 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్టీపీ ప్లాంట్లు
- ఎస్టీపీల్లో ట్రీట్ చేసిన నీటిని రీసైక్లింగ్ ద్వారా పార్కుల్లో ఇతరత్రా అవసరాలకు వాడుకునేలా నీటినిల్వ సంపు, తగిన పంపులు, పైప్‌లైన్ నెట్‌వర్క్‌తో
- ఘనవ్యర్థాల నిర్వహణ యార్డు
- వర్షపునీటి నిల్వకు ఇంకుడు గుంతలు
- భవిష్యత్‌లో రోడ్ల కటింగ్ లేకుండా డక్ట్‌ల ఏర్పాటు
- తాగునీటి సరఫరా ఏర్పాట్లు. 10.05 కి.మీ.ల పైప్ నెట్‌వర్క్. 21 వేల కిలోలీటర్ల స్టోరేజీ సామర్థ్యం
- వరదనీటి బాక్స్ డ్రెయిన్లు 10.55 కి.మీ
- విద్యుత్ సరఫరా కోసం 137 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, అండర్‌గ్రౌండ్ కేబుల్స్, ఆర్‌సీసీ డక్ట్స్, ఎల్ఈడీ స్ట్రీట్ లైట్స్
- 3 షాపింగ్‌కాంప్లెక్స్‌ల్లో 118 దుకాణాలు

భవిష్యత్ అవసరాల కోసం..

భవిష్యత్‌లో ఆయా సదుపాయాల కోసం అవసరమైన స్థలాల్ని లేఔట్‌లో కేటాయించారు. వివరాలిలా ఉన్నాయి.

- వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లతో పార్కులు. ప్లే గ్రౌండ్స్, ఓపెన్ ఎయిర్ జిమ్స్, ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఓపెన్ స్పోర్ట్స్ ఎరీనా, పిల్లల కోసం టాట్‌లాట్స్, మల్టీ పర్పస్ గ్రౌండ్, ఆంఫీ థియేటర్, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం, బతుకమ్మ ఘాట్.
- షాపింగ్ సదుపాయాలు, కమ్యూనిటీ సెంటర్లు, వెజ్.. నాన్‌వెజ్ మార్కెట్లు.
- ప్లేస్కూల్స్, అంగన్‌వాడీ సెంటర్లు, ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లు,
- బస్ టెర్మినల్, బస్‌స్టాప్స్, పోలీస్‌స్టేషన్, ఫైర్‌స్టేషన్, మిల్క్‌బూత్స్, పెట్రోల్‌బంకులు, బస్తీ దవాఖానాలు, అన్ని సదుపాయాలతో హాస్పిటల్, బ్యాంక్, ఏటీఎంలు, పోస్టాఫీసు



సీఎం సభా ఏర్పాట్ల పరిశీలన



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న టీఎస్ ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, కలెక్టర్, ఎమ్మెల్యే

పటాన్‌చెరు: పటాన్‌చెరు పట్టణంలో ఈనెల 22వ తేదీన సీఎం కేసీఆర్ చేతుల మీదుగా నిర్వహించతలపెట్టిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి శంకుస్థాపన కార్యక్రమ ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం టీఎస్ ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, కలెక్టర్ డాక్టర్ శరత్‌తో కలిసి సభ ఏర్పాట్లను పరిశీలించారు. సభావేదికతో పాటు, ప్రజల గ్యాలరీ, పార్కింగ్, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. సభకు 30 వేలకు పైగా జనం హాజరుకానున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. బుధవారం సాయంత్రంలోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల స్వప్నం సాకారం కానున్న నేపథ్యంలో భారీగా సభకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

రేపు మెగా జాబ్ మేళా

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణంలోని జిల్లా ఉపాధి కార్యాలయం ద్వారా ఈనెల 22వ తేదీన ప్రభుత్వ తార డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వందన మంగళవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో 20 నుంచి 30 కంపెనీలు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీఫార్మ, ఎం ఫార్మా, బీటెక్ చేసి ఉండాలన్నారు. 18 నుంచి 30 సంవత్సరాలు మధ్య వయస్సు వారు అర్హులన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కలెక్టర్ శరత్

జిన్నారం(పటాన్‌చెరు): విద్యతోపాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని కలెక్టర్ శరత్ అన్నారు. జిన్నారం మండలంలోని నల్తూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను 'మన ఊరు-మనబడి' కార్యక్రమంలో భాగంగా పురుద్ధరించారు. ఈ పాఠశాలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ×మన ఊరు-మన బడి₹ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. బడీడు పిల్లలను తల్లిదండ్రులు బడిలో చేర్పించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మన ఊరు-మన బడి పథకంలో రూ.212 కోట్లతో 443 పాఠశాలలను పునరుద్ధరణ చేశామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్‌రావు, సర్పంచ్ జనార్ధన్, నాయకులు రాజేశ్, వెంకటేశంగౌడ్ పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలను అందిస్తున్న కలెక్టర్ శరత్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా..

రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సదాశివపేటలోని రహమత్‌నగర్ కాలనీలో ×మన ఊరు-మనబడి₹ కార్యక్రమంలో ఆధునీకరించిన ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించి ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం అందస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పిల్లోడ జయమ్మ, వైస్ చైర్మన్ చింతా గోపాల్, ఎంఈఓ దండు అంజయ్య తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి, కౌన్సిలర్లు విశ్వనాథం, రజియాబేగం, చౌదరి ప్రకాష్, హెచ్ఎం అమీరుద్దీన్, ఎస్ఎంసీ చైర్ పర్సన్ వసిమాబేగం, సీఆర్పీ రాజేశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, ప్రధాన కార్యదర్శి వీరేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సదాశివపేటలో మాట్లాడుతున్న రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్

మౌలిక వసతుల కల్పనకు..

రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. మంగళవారం ×మన ఊరు-మనబడి₹ పథకం ద్వారా రూ.20 లక్షలతో మండలంలోని మంగాపూర్ ప్రభుత్వ ప్రాథమి పాఠశాలలో మరమ్మతులు, రూ.30 లక్షలతో దౌలాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ, మరుగుదొడ్లు నిర్మించారు. వీటిని ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించారు. అలాగే సికింద్లాపూర్‌లో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యాభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, మెదక్ జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్ రెడ్డి, సర్పంచ్‌లు యాదయ్య పాల్గొన్నారు.



మంగాపూర్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్ రెడ్డి

మూఢనమ్మకాల నిర్మూలన చట్టం చేయాలి

సంగారెడ్డి టౌన్: చేతబడి, బాణామతి, మూఢనమ్మకాల నిర్మూలన చట్టం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్ అన్నారు. బాధితులకు న్యాయం చేయకుంటే కలెక్టరేట్ ముట్టడి స్తామన్నారు. మంగళవారం కొల్కూర్ బాధితులతో కలిసి అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అడిషనల్ కలెక్టర్ స్పందిస్తూ బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని, గ్రామంలో ప్రజలను చైతన్యపర్చేందుకు అవగాహ న కార్యక్రమం నిర్వహించాలని సదాశివపేట తహసిల్దార్‌ను ఫోన్‌లో ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి

కర్ణాటక పోలీసులతో సమావేశం



సరిహద్దు పోలీసు స్టేషన్ల ఎస్ఐలతో సమావేశమైన డీఎస్పీ రఘు

జహీరాబాద్: త్వరలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పక్కనే ఉన్న కర్ణాటక, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు పోలీసులతో జహీరాబాద్ డీఎస్పీ రఘు సమావేశమయ్యారు. మంగళవారం బీదర్‌లో నిర్వహించిన సమావేశంలో భవిష్యత్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఇటీవల కర్ణాటక రాష్ట్ర ఎన్నికలు జరిగిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీసులు పూర్తి సహకారం అందించారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా పరస్పరం సహకరించుకోవాలని డీఎస్పీ వారిని కోరారు. సమావేశంలో బీదర్ డీఎస్పీ సతీష్, సరిహద్దు పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, రూరల్ సీఐ వెంకటేష్, నారాయణఖేడ్ సీఐ రామకృష్ణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

రేపు జెడ్పీ సమావేశం

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఈనెల 22వ తేదీన సంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ఎల్లయ్య మంగళవారం తెలిపారు. సమావేశానికి చైర్ పర్సన్ మంజుశ్రీ అధ్యక్షత వహిస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలన్నారు.

జాతీయ స్థాయిపోటీలకు అందోల్ క్రీడాకారులు



విష్ణు



సాయిదీపక్

వట్‌పల్లి(అందోల్): జాతీయ స్థాయి జూనియర్ టార్గెట్ బాల్ పోటీలకు అందోల్ క్రీడాకారులు ఎంపికైనట్లు స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సేనాపతి తెలిపారు. ఈనెల 17, 18 తేదీల్లో రంగారెడ్డి జిల్లా పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి 5వ జూనియర్ టార్గెట్‌బాల్ పోటీల్లో సంగారెడ్డి జిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలిచి వెండి పతకం సాధించింది. జోగిపేటలోని ఎస్ఆర్ఎం కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు కె.విష్ణు, ఎన్.సాయిదీపక్ జిల్లా వెండి పతకాలు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికకావడం పట్ల మంగళవారం స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ సమన్వయకర్త మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్ భవానీ నాగరత్నంగౌడ్ వారిని అభినందించారు. ఈనెల 25 నుంచి 28 వరకు హర్యానాలో జరిగే జాతీయసాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

గ్రంథాలయంలో విద్యా దినోత్సవం

సంగారెడ్డి మున్సిపాలిటీ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం విద్యా దినోత్సవాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నరహరిరెడ్డి, కార్యదర్శి వసుంధర ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ హాజరయ్యారు. గ్రంథాలయ సంస్థ తరపున రీడింగ్ రూమ్ కేంద్రానికి పుస్తకాలు, దినపత్రికలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సిబ్బంది ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి జయరాజు

సంగారెడ్డి టౌన్: ధరణిలో పేరుకుపోయిన భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి జయరాజు అన్నారు. మంగళవారం తెలంగాణ రైతు సంఘం సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో దాదాపు 5 వేల పైగా ధరణి భూ సమస్యల దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి రైతులు కలెక్టర్ కార్యాలయం, మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. దరఖాస్తు చేసిన ప్రతీసారి రూ.1300 నుంచి 2 వేల వరకు ఖర్చవుతోందని, అయినా సమస్యలు పరిష్కారం కావడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి భూ సమస్యలను పరిష్కరించాలని, లేనియెడల జిల్లా వ్యాప్తంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కూరాకుల రాజయ్య, ఉపాధ్యక్షుడు బి.యాదవ రెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి జయరాజు

బంకర్ బెడ్‌ల బహూకరణ

మునిపల్లి(అందోల్): విద్యార్థుల సౌకర్యార్థం లింగంపల్లి గురుకుల పాఠశాలకు ఎల్‌అండ్‌టీ, ఐడీపీఎల్ సంస్థ నిర్వాహకులు బంకర్ బెడ్‌లను బహూకరించారు. వీటిని మంగళవారం ప్రారంభించారు. తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజికి 240 కస్టమ్, డిజైన్ చేసిన బంకర్ బెడ్‌లను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చైతన్య కుమార్‌కు అందజేసినట్లు ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధి సురేశ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం నాలుగు అదనపు తరగతి గదులను నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బంకర్ బెడ్‌లను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆరోరోజు 741 మంది రాక

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఎస్.ఐ, కానిస్టేబుల్ రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు సంబంధించిన ధ్రువ ప్రతాల పరిశీలన ఆరోరోజు 800 మందికిగాను 741 హాజరైనట్లు మంగళవారం ఎస్పీ ఎం.రమణ కుమార్ తెలిపారు. వెరిఫికేషన్‌కు వచ్చే అభ్యర్థులు తప్పనిసరిగా తమతోపాటు వెరిఫికేషన్ లెటర్, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తోపాటు ఒక జిరాక్స్ సెట్ తీసుకొని, తమకు కేటాయించిన రోజున సమయానికి పోలీస్ కల్యాణ మండపంలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.ఉష విశ్వనాథ్ తదితులున్నారు.



సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు

క్లుప్తంగా

వడదెబ్బతో మతిస్థిమితం లేని మహిళ మృతి

నర్సాపూర్: వడదెబ్బతో మతిస్థిమితం లేని మహిళ మృతిచెందింది. ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..నర్సాపూర్‌లోని చైతన్యపురి కాలనీకి చెందిన సంకు లక్ష్మి (45)కి కొన్ని రోజుల నుంచి మతిస్థిమితం సరిగా లేదు. ఆమె ఏ పనీ చేయకుండా భిక్షాటన చేస్తుండేది. వారం రోజుల నుంచి తన ఆరోగ్యం విషయమై తనలో తాను బాధపడుతుండేది. కాగా మంగళవారం మధ్యాహ్నం మండలంలోని కొండాపూర్ బస్టాప్ సమీపంలో ఓ మహిళ మృతదేహం ఉందని ఆమె సోదరుడు ఆంజనేయులుకి సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి చూశాడు. తన అక్క సంకు లక్ష్మిగా గుర్తించాడు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మద్యం సేవించిన వ్యక్తికి జైలు

తూప్రాన్: మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి మెదక్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి మంగళవారం ఒకరోజు జైలు శిక్ష విధించినట్టు ఎస్‌ఐ సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 19న పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా శివరాత్రి యాకయ్య మద్యం తాగి వాహనాన్ని నడుపుతూ పట్టుబడినట్లు ఎస్‌ఐ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసుకొని చార్జిషీట్‌ను స్పెషల్ మొబైల్‌కోర్టు మెదక్‌లో సమర్పించారు. న్యాయమూర్తి కల్పనా విచారణ తర్వాత ఒకరోజు జైలు శిక్షను విధించినట్లు తెలిపారు.

బార్ అండ్ రెస్టారెంట్‌పై కేసు నమోదు



తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

హుస్నాబాద్: కల్తీ మద్యం విక్రయిస్తున్నారని పట్టణంలోని జగదాంబ బార్ అండ్ రెస్టారెంట్‌పై కేసు నమోదు చేసినట్లు హుస్నాబాద్ ఎక్సైజ్ ఎస్‌ఐ దామోదర్ తెలిపారు. పట్టణంలోని బార్ అండ్ రెస్టారెంట్లలో ఇద్దరు ఎస్‌ఐలు సిబ్బందితో సోమవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో జగదాంబ బార్ అండ్ రెస్టారెంట్‌లో రాయల్ స్టాగ్ బ్లెండెడ్ విస్కీ (1000 ఎంఎల్) మద్యం బాటిల్లో వాటర్ లెవల్స్ ఎక్కువగా ఉన్నట్లు హైడ్రో మీటర్ పరీక్షల ద్వారా ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. డైల్యూషన్ ఉన్న 6 బాటిళ్లను సీజ్ చేసి రసాయనాల పరీక్షల నిమిత్తం నిజామాబాద్ రసాయన ప్రయోగశాలకు పంపినట్లు తెలిపారు. బార్ అండ్ రెస్టారెంట్ నౌకర్ నామ భాస్కర్ పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పూర్తి స్థాయి రిపోర్టు వచ్చిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశం మేరకు తగుచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ దామోదర్ తెలిపారు.

లారీ.. బైక్ ఢీ: ఒకరికి గాయాలు

వర్గల్(గజ్వేల్): బైక్ మీద వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ ఘటన మంగళవారం వర్గల్ మండలం గౌరారం రూరల్ సర్కిల్ కార్యాలయ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మైలారం గ్రామానికి చెందిన బూరుగుపల్లి రాములు(40) తన బైక్ మీద గౌరారం నుంచి మైలారం వెళ్తున్నాడు. రూరల్ సర్కిల్ కార్యాలయ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ, బైక్‌ను ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో బైకిస్టు రాములు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే గౌరారం పోలీసులు 108 అంబులెన్స్‌లో లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో కేసు నమోదు

చేగుంట(తూప్రాన్): పొలం దున్నుకోవడానికి వెళ్లిన వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. మాసాయిపేట మండలం బొమ్మారం గ్రామంలో సిద్ధిరాములు తన పొలం దున్నుకోవడానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన మట్టెల మల్లేశం, మట్టెల శంకర్‌లు తమ పొలంనుంచి ట్రాక్టర్ ఎందుకు తీసుకెళ్లావని సిద్ధిరాములుపై దాడి చేశారు. దీంతో అతని తలకు గాయాలయ్యాయి. తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న సిద్ధిరాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ
- రాణిస్తున్న సిద్దిపేట వాసులు
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శారీరక, మానసిక ఆందోళనలను తగ్గిస్తు, సంపూర్ణ ఆరోగ్యం కల్గిస్తు నిత్య నూతనోత్సవాన్ని అందించేది యోగా. ప్రతి రోజు యోగా, ధ్యానం చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పెద్దలు చెబుతారు. భారతదేశంలో పూరాతన కాలం నుంచి యోగా అభ్యసనలు చేస్తున్నారు. ప్రపంచానికి యోగాను పరిచయం చేసింది భారతదేశమే. జూన్ 21ని పురస్కరించుకొని ప్రపంచ యోగా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నారు. బుధవారం ఉదయం 6గంటల నుంచి 7గంటల వరకు సిద్దిపేట పట్టణంలోని మిని క్రికెట్ స్టేడియంలో 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సాముహిక యోగా సాధన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరుకానున్నారు. సిద్దిపేట జిల్లా నేడు యోగాలో జాతీయ స్థాయిలో గుర్తింపును పొందింది. అనేక మంది రాష్ట్ర, జాతీయ, యోగా పోటీల్లో రాణించడంతో పాటుగా, అనేక మందికి యోగాను నేర్పుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయంగా యోగాను నేర్పుతున్నారు. జిల్లాలోని వ్యాసమహర్షి యోగా సొసైటీ, సిద్దిపేట యోగా స్పోర్ట్స్ అసోసియేషన్, పతంజలి యోగా అసోసియేషన్, తదితర సంస్థల ఆధ్వర్యంలో నిత్యం యోగా శిక్షణ ఇస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ యోగా శిక్షకులు తోట సతీశ్ స్వయంగా రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా పోటీల్లో రాణిస్తూ, అనేక మందికి యోగాలో శిక్షణ ఇస్తున్నారు. వ్యాస మహర్షి యోగా సొసైటీ, సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ప్రతీ రోజు ఉచిత యోగా శిక్షణలు ఇస్తున్నారు.

ఉచిత యోగా శిబిరాలు

సందర్భాన్ని బట్టి ఉచిత యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. బాలసదనం, అభయజ్యోతి, నర్సింగ్ కళాశాల, మంత్రి క్యాంప్ కార్యాలయం,



యోగా చేస్తున్న చిన్నారులు

ఎన్‌జీవోస్ కాలనీ, సిటిజన్ క్లబ్, కోమటి చెరువు, వ్యాసమహర్షి సొసైటీలో, పాఠశాలల్లో, తదితర చోట్ల ఉచితంగా యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపుగా 50వేల మందికి యోగాలో శిక్షణ ఇవ్వగా, అదేవిధంగా 500 మందిని యోగా శిక్షకులుగా శిక్షణ అందించారు. వయస్సు పైబడిన వారికి అనుకూలంగా రిథమిక్, పవర్, స్టిక్, రూప్ యోగాలు నేర్పిస్తున్నారు.

కరోన సమయంలో

కరోనా సమయంలో ఆన్‌లైన్ ద్వారా యోగా శిక్షణ అందించారు. ముఖ్యంగా వృద్ధులకు, మహిళలకు, చిన్నారులకు ఎంతో ఉపయోగపడింది. మానసిక ఆందోళన తొలగించడానికి, ప్రశాంతత నెలకొనే విధంగా తర్ఫీదు ఇచ్చారు.

సిద్దిపేట నుంచి

సిద్దిపేటలో మొదట యోగా శిక్షణ అనంతరం అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా యోగా శిక్షణ అందిస్తున్నారు. యూట్యూబ్ ద్వారా కూడా యోగా కార్యక్రమాలను చూపిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా 24 వారాల పాటుగా విదేశాలకు చెందిన 500 మందికి పైగా యోగాలో శిక్షణ ఇస్తున్నారు. అమెరికా, ఐర్లాండ్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు చెందిన వారు ఈ ఆన్‌లైన్‌లో శిక్షణ పొందుతున్నారు.

సర్వరోగ నివారిణి

సర్వరోగ నివారిణిగా యోగా ఉపయోగపడుతుందన్నారు. యోగా హెల్త్ డ్రైవ్ పేరిట అస్తమా, డయాబెటిస్, తదితర వ్యాధులకు అక్యుపంచర్, మడ్‌బాత్(మట్టిస్నానం)లతో యోగా చికిత్స నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సిద్దిపేటలో భాగంగా వ్యాస మహర్షి సొసైటీ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్ ఆధ్వర్యంలో మంత్రి హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయంలో అన్ని వయస్సుల వారికి యోగా శిక్షణ ఇస్తున్నారు.

చిన్నారులకు, మహిళలకు శిక్షణ

చిన్నారులకు, మహిళలకు ఇంటి వద్దే ఏర్పాటు చేసిన యోగా శిక్షణ శిబిరంలో ప్రతీ రోజు ఉదయం 6గంటల నుంచి 7గంటల వరకు, సాయంత్రం 7.30గంటల నుంచి, రాత్రి 9గంటల వరకు తన భార్య తోట సంధ్య సహకారంతో ప్రత్యేక యోగా శిక్షణ అందిస్తున్నారు. బాలసంస్కార్ పేరిట నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమంలో యోగాతో పాటుగా డ్రాయింగ్, చేతిరాత, భాషలపై పట్టు, ప్రాచీన సంస్కృతీ, సాంప్రదాయాలపై అవగాహన, భగవద్గీత, రామాయణంపై అవగాహన తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.



గీతా స్కూల్లో 'యోగా డే' ఆకృతిలో విద్యార్థులు

తూప్రాన్‌లో..

తూప్రాన్: జూన్ 21 యోగా డే సందర్భంగా పట్టణంలోని గీతా స్కూల్లో ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు 'యోగా డే' ఆకారంలో కూర్చుని యోగా విశిష్టతను తెలియజేశారు. కరస్పాండెంట్ పి.రామాంజనేయులు యోగా వల్ల కలిగే లాభాలను వివరించారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

మానసిక ఆరోగ్యం పెరుగుతుంది



యోగాను మన పూర్వీకులు ప్రపంచానికి అందించిన గొప్ప సంపద. ప్రతీ రోజు యోగా చేసిన వారికి మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుంది. యోగాలో రాష్ట్ర స్థాయి, జాతీయ బహుమతులు గెల్చుకున్నాను. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాను క్రీడల జాబితాలో చేర్చినందున, దానికి మంచి పేరు వచ్చింది.

–సతీశ్, యోగా శిక్షకులు, సిద్దిపేట

అందరూ చేయొచ్చు



యోగాను అందరూ చేయొచ్చు. దీనికి వయస్సు, లింగత్వం ఉండదు. అన్ని వయస్సుల వారు, స్త్రీలు, పురుషులు అందరూ చేయొచ్చు. ముఖ్యంగా బాలికలు, యువతులు, మహిళలకు ఈ యోగాతో అనేక శారీరక సమస్యలు నయం అవుతాయి. నిత్యం యోగా చేయడం ద్వారా డయబెటిస్, అధిక బరువు, నడుం నొప్పులు వంటివి దూరమవుతాయి.

–తోట సంధ్య, యోగా శిక్షకురాలు, సిద్దిపేట

యోగాలో రాణిస్తున్న టేక్మాల్ పీఈటీ నర్సింలు

టేక్మాల్(మెదక్): ఆయనొక సాధారణ వ్యాయమ టీచర్. యోగాలో తనదైనశైలిలో ఆసనాలు వేస్తూ అందరిని అబ్బుర పరచడంతో పాటూ, విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాడు. టేక్మాల్ మోడల్ స్కూల్‌లో పని చేస్తున్న పీఈటీ గజేంద్రుల నర్సింలు, యోగా మీద మక్కువతో తను పదోతరగతిలోనే కర్ణం గణేష్ రవికుమార్ వద్ద యోగ నేర్చుకొని రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో పాల్గొన్నాడు. భూమాసానం, హనుమానాసనం, పరివృత్త పార్వసన, కుకుటాసన, హలాసనం, చక్రసానం, వీరభద్రాసన, నట్రాజాసన, వృచ్చికాసన, త్రివిక్రసాన, కూర్మాసన వంటి తదితర ఆసనాలను విద్యార్థులకు నిత్యం నేర్పుతున్నాడు. యోగాలో దిట్టగా నిలిచినా నర్సింలు గతంలో ఉత్తమ క్రీడాకారుడిగా మండల, జిల్లా స్థాయిలో బహుమతులు అందుకున్నారు.



వృచ్చికాసనం వేస్తున్న పీఈటీ నర్సింలు

బావల చేతిలో బావమరిది దారుణ హత్య

కొల్చారం(నర్సాపూర్): ఆస్తికోసం సొంత బావల చేతిలోనే బావమరిది హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన కొల్చారం మండలం అప్పాజీపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొంగోటి శేకులు (23) తండ్రి నర్సింలు మూడేళ్ల క్రితమే చనిపోయాడు. మృతుడికి ముగ్గురు అక్క చెల్లెలు. శేకులు పేరుపై గ్రామ సమీపంలో రెండు, ఏడుపాయల సమీపంలోని కురువగడ్డలో మరో రెండు ఎకరాల పొలం ఉంది. స్వ గ్రామంలో ఇటీవల రూ.20 లక్షలతో ఇల్లు నిర్మించాడు. కాగా శేకులు తల్లి పోచమ్మతో తరచూ గొడవపడుతుండేవాడు. దీంతో విసిగి పోయిన తల్లి కూతుళ్లకు ఈ విషయం చెప్పింది.

దీంతో అదే రోజు సాయంత్రం కూతుళ్లు తమ భర్తలను వెంటబెట్టుకొని అప్పాజీపల్లికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి కుల సంఘం చిట్టి మీటింగ్ ఉండడంతో వారి వద్దకు వెళ్లిన పోచమ్మ తన గోడును వెల్లబోసుకుంది. దీంతో వారు శేకులును పిలిపించి మాట్లాడుతామని ఆమెకు సర్ది చెప్పారు. మరుసటి రోజు(మంగళవారం) తల్లి, కొడుకు మధ్య ఉన్న వైరాన్ని మాట్లాడేందుకు సంఘం పెద్దలు సమావేశమై తల్లి కొడుకును పిలిపించేందుకు ఇంటికి మనిషిని పంపించినట్లు తెలిపారు. అంతలోనే శేకులు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు అతని అక్క చెల్లెలు, బావలు ఏడుస్తుండడం గమనించిన వ్యక్తి సంఘం పెద్దలకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి వెళ్లిన గ్రామ పెద్దలు అక్కడికి వెళ్లి చూడగా ఆత్మహత్యకు సంబంధించి అనుమానం వ్యక్తం కావడంతో, వెంటనే కొల్చారం ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్‌కు సమాచారం అందజేశారు. మెదక్ డీఎస్పీ సైదులు, మెదక్ రూరల్ సీఐ విజయ్‌కి సమాచారం చేరవేసి క్లూస్ టీంను రప్పించినట్లు తెలిపారు. క్లూస్ టీం ఆధారాల కోసం వెతుకుతుండగా ఇంట్లోని ఓ మూలన డ్రమ్ములో రక్తపు మరకలతో కూడిన శేకులు ప్యాంటు, చొక్కా, రక్తపు మరకలతో కూడిన కర్రలు లభించినట్లు తెలిపారు. మృతుని తల్లి పోచమ్మ ద్వారా వివరాలు తెలుసుకున్న డీఎస్పీ కుటుంబ సభ్యులందరినీ అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. శేకులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియాసుపత్రికి తరలించి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టనున్నట్లు డీఎస్పీ తెలిపారు.



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ

ఆస్తి కోసం హత్య..

శేకులు పేరుమీద భూమి, ఇల్లుకు సంబంధించి దాదాపు రూ.రెండు కోట్ల ఆస్తి ఉంటుందని, ఈ విషయంలోనే అతని అక్క చెల్లెల్లు తరచూ ఆస్తి విషయమై గొడవ పడేవారని చుట్టుపక్కల వాళ్లు తెలిపారు. ఆస్తి కోసమే అతని బావలు శేకులును కొట్టి చంపి ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం చేసినట్లు గ్రామస్తులు అనుమానాలను వ్యక్తం చేశారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్య

కుటుంబ కలహాలతో ఒకరు, అదనపుకట్నం వేధింపులు భరించలేక ఇంకొకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అక్కన్నపేటలో మరొకరు, గుల్పర్తిలో యువకుడు మృతి చెందారు.

మెదక్‌జోన్: భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా హవేలిఘనాపూర్ మండలం శాలిపేట అటవీప్రాంతంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..రామాయంపేట మండలం కాట్రియాల్ గ్రామానికి చెందిన రాగిశెట్టి సాయికుమార్ భార్య స్రవంతిలు మంగళవారం ఉదయం ఇంట్లో గొడవ పడ్డారు. మనస్థాపం చెందిన భార్య స్రవంతి పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. దీంతో భర్త రాగిశెట్టి సాయికుమార్(28) శాలిపేట అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం తేవాలని..

కంది(సంగారెడ్డి): అదనపు కట్నం వేధింపులు భరించలేక మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కంది మండలంలోని జుల్కల్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజేశ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం..అందోల్ మండలం చిన్న చింతకుంట గ్రామానికి చెందిన తరన్నుమ్(22)తో జుల్కల్‌కు చెందిన సాబెర్‌తో 2021లో వివాహం జరిగింది. వరకట్నం కింద రూ.2లక్షలతో పాటు ఆరున్నర తులాల బంగారం, ఇతర సామగ్రి ఇచ్చారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. గతేడాది నుంచి భర్త సాబెర్, అత్త మహబూబ్ బీ, బావ జహంగిర్, తోడికోడలు షహీన్, మరిది ఇమ్రాన్‌లు రూ.25వేలు అదనపుకట్నం తేవాలని తరన్నుమ్‌ను వేధించారు. సోమవారం మధ్యాహ్నం తనను భర్త అత్తింటి వారు వేధిస్తున్నారని తనతల్లికి ఫోన్‌లో తెలిపింది. అనంతరం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో ఇంట్లో దూలానికి ఉరివేసుకుంది. దీన్ని గమనించిన కుటుంబికులు ఆమెను చికిత్స కోసం సంగారెడ్డిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఆమెను పరీక్షించిన దాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి శంషోద్దీన్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



తరన్నుమ్ (ఫైల్)

అక్కన్నపేటలో యువకుడి..

రామాయంపేట(మెదక్): అక్కన్నపేటలో యువకుడు ఉరివేసుకొని మృతిచెందాడు. గ్రామానికి చెందిన శాఖని స్వామి (35) పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికునిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి స్టేషన్ రోడ్డులో గుడిసెలో ఉరివేసుకొని మృతి చెందినట్టు గ్రామస్తులు, స్థానికులు పేర్కొన్నారు.



శాఖని స్వామి (ఫైల్)

గుల్పర్తిలో మరో యువకుడి..

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని గుల్పర్తి గ్రామానికి చెందిన యువకుడు ఎర్రం పరశురాములు రాంలు (21) మంగళవారం రాత్రి ఉరివేసుకొని మృతి చెందాడు. కుటుంబ సమస్యలతోనే అతడు ఉరివేసుకొని మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు.



పరశురాములు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో సుతారిపల్లికి చెందిన యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన అరుణ్ (18) బైక్‌పై రామాయంపేటవైపు నుంచి సుతారిపల్లి వెలుతుండగా, ఎదురుగా అతివేగంగా వస్తున్న టాటా ఏసీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అరుణ్‌ను చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. ఎస్‌ఐ రంజిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసిన ఎనిమిది మంది రిమాండ్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): బాణామతి, చేతబడి చేశారంటూ చెట్టుకు వేలాడదీసి దాడి చేసిన ఘటనలో ఎనిమిది మంది నేరస్థులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సంగారెడ్డి డీఎస్పీ రవీంద్ర రెడ్డి తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను సీఐ నవీన్ కుమార్ వెల్లడించారు. చేతబడి నెపంతో దాయాదులు తమపై దాడి చేశారని ముత్తంగి అమృత భర్త యాదయ్య ఈ నెల 17న ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా కొల్కూరు గ్రామానికి చెందిన ఎనిమిది మంది దాయాదులు ముత్తంగి అమృత, వారి భర్త యాదయ్యతో పాటుగా ఫిర్యాదురాలి అక్క కోవూరి శ్యామమ్మపై దాడి చేసినట్లు తెలిసింది. విచారణ చేపట్టగా గ్రామానికి చెందిన కోహీర్ లక్ష్మణ్(ఏ1), గడ్డం పెంటయ్య(ఏ2), ముత్తంగి బాగయ్య(ఏ3), సర్గల్ల శివయ్య(ఏ4), కోవూరు శివకుమార్(ఏ5), బేగరి శివ కుమార్(ఏ6), గడ్డం శ్యామల(ఏ7), గడ్డం ఆగమ్మ (ఏ8) వారు చేసిన నేరాన్ని అంగీకరించారు. దీంతో సదాశివపేట పోలీసులు వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుచగా వారికీ రిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు నాగలక్ష్మి, సుదర్శన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నేరస్తులను రిమాండ్‌కు తరలిస్తున్న దృశ్యం

చికిత్స పొందుతున్న ముగ్గురు మృతి

ఆయా సంఘటనల్లో చికిత్స పొందుతున్న ముగ్గురు మృతి చెందారు.

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌కు చెందిన చాడ మల్లవ్వ(70) అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 10న హుస్నాబాద్‌లోని కూతురు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చిక్సిత నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చిక్సిత పొందుతూ మంగళవారం మృతి చెందింది. దీనిపై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

రాయపోలు(దుబ్బాక): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం..ఆరెపల్లికి చెందిన దాతర్‌పల్లి మల్లేశం గత నెల 29న లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సూర్ణ బిక్షపతి ద్విచక్రవాహనంపై ఆరెపల్లి నుంచి లింగారెడ్డిపల్లి వెళ్తుండగా..ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో మల్లేశం పరిస్థితి విషమంగా ఉండడంతో నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మొదటి అంతస్తు నుంచి కింద పడి..

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ హెచ్.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డి నిజాంపేట్ మండలం నగ్దల్‌కు చెందిన కోకొండ రాజు(35) బతుకుదెరువు కోసం 15 సంవత్సరాల క్రితం వచ్చి, పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 16వ తేదీన తను నివాసం ఉండే మొదటి అంతస్తు నుంచి కిందికి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి పడటంతో తలకు గాయమైంది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. తిరిగి అక్కడ నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజు మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మల్లేశం మృతదేహం

ఇద్దరు సైబర్ నేరస్తుల అరెస్ట్

- అమ్మాయిల ఫొటోలు షేర్ చేస్తూ మొదట పరిచయం
- అత్యాధునిక టెక్నాలజీ సాయంతో గుర్తింపు : సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: గుర్తు తెలియని వ్యక్తులకు ఆన్‌లైన్‌లో మొదట అమ్మాయిల ఫొటోలు షేర్ చేసి పరిచయం చేసుకుంటారు. అనంతరం అశ్లీల ఫొటోలు పంపించి బాధితులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గజ్వేల్ ఏసీపీ రమేశ్‌తో కలిసి సీపీ శ్వేత వివరాలు వెల్లడించారు. జగిత్యాల పట్టణం కీళ్లగడ్డలో నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న ఆరేపల్లి అభిషేక్ (24), కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం పెద్దపాపాయపల్లి గ్రామానికి చెందిన భాషవేన అభినాష్ (21) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరిరువురు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో షేర్ చాట్‌లో అమ్మాయిల ప్రొఫైల్ ఫొటోలతో (డీపీ) ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసుకునేవారు. తర్వాత స్పందించిన వ్యక్తుల వాట్సప్ నెంబర్‌కు న్యూడ్ వీడియోలు, అశ్లీల చిత్రాలు, ఫొటోలు పంపిస్తూ సైబర్ నేరస్థులు వారితో చాట్ చేసేవారు. అనంతరం వీరు చేసిన చాట్‌ను, అశ్లీల చిత్రాలను స్క్రీన్ షాట్ తీసి మొబైల్‌లో భద్రపరుచుకుంటారు. వీరు చాట్ చేసిన స్క్రీన్ షాట్లను వేరే నెంబర్ నుంచి బాధితుల వాట్సప్ నెంబర్లకు పంపిస్తూ మేము గచ్చిబౌలి నుంచి సైబర్ క్రైం ఎస్‌ఐని మాట్లాడుతున్నానని చెబుతూ మీ అశ్లీల చిత్రాలు, చాట్ చేసిన స్క్రీన్ షాట్స్, ఇతర వివరాలు తమ వద్ద వచ్చాయని, దీనిపై తమకు ఫిర్యాదు అందిందని బాధితులను బెదిరిస్తూ వారి నుంచి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వారు సూచించిన బ్యాంకు ఖాతాకు పంపించుకునేవారు. ఈ క్రమంలో కమిషనరేట్ పరిధిలోని బేగంపేట పోలీస్ స్టేషన్‌లో కొద్ది రోజుల క్రితం నమోదైన సైబర్ నేరంపై పరిశోధనలో భాగంగా సీపీ శ్వేత ఆదేశానుసారం గజ్వేల్ ఏసీపీ రమేశ్ ఆధ్వర్యంలో తొగుట సీఐ కమలాకర్, బేగంపేట ఎస్‌ఐ అరుణ్, కానిస్టేబుళ్లు రాజు, అనిల్, రామచంద్రారెడ్డిలతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. విచారణలో భాగంగా బాధితుడి వద్ద నుంచి ఇద్దరు వ్యక్తులు కుకునూర్‌పల్లి బస్టాండ్ వద్ద డబ్బులు తీసుకున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు తొగుట సీఐ కమలాకర్, ఎస్‌ఐ అరుణ్ ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో వారు చేసిన తప్పును ఒప్పుకున్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే ధైర్యంగా పోలీసులకు లేదా 1930కు ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు.



మాట్లాడుతున్న సీపీ శ్వేత, ఏసీపీ రమేశ్, తొగుట సీఐ కమలాకర్, ఎస్‌ఐ అరుణ్